సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 6 । ఆగస్టు । 2023



బాబు మాటలను నమ్మొద్దు

కడప జిల్లా బిడ్డలపై చంద్రబాబు కపట ప్రేమను ఒలకబోస్తున్నారని, ఆయన మాటలను జిల్లా ప్రజలెవరూ నమ్మొద్దని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. -10లో



ఆధిక్యంలో సౌత్‌జోన్ జట్టు

కడపలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 మల్టీ డేస్ జోనల్ మ్యాచ్‌లో సౌత్‌జోన్ జట్టు 167 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. -10లో

గరిష్టం/కనిష్టం
36.5/27.7

వాతావరణం

జిల్లాలో శనివారం 27.7 - 36.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కోదండ రామయ్యకు స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ మూర్తులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారులు ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు సమర్పించారు. సీతారామ లక్ష్మణ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు.అనంతరం ఆలయ పండితులు వేద పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు.

21న 'ఏపీ ఎన్జీఓ' రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు

కడప రూరల్: విజయవాడలో ఈ నెల 21, 22వ తేదీల్లో ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ 21వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆవిష్కరించారు. అనంతరం అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై ప్రసాద్ యాదవ్, కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహ అధ్యక్షులు తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేల్ డివిజన్‌లో 69 మిల్లీమీటర్ల వర్షం



కడప అగ్రికల్చర్: జిల్లాలోని బద్వేల్ డివిజన్‌లో మాత్రమే శనివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. అందులో బద్వేల్ డివిజన్ మొత్తం 69 మిల్లీమీటర్లు కురవగా కేవలం కాశినాయన మండలంలో మాత్రం అత్యధికంగా 40.8 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాలైన పోరుమామిళ్లలో 9, బికోడూరులో 6.8, గోపవరం మండలంలో 1.4 , బద్వేల్ మండలంలో 1.2, బి మఠం మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.డివిజన్ పరిధిలో వరితోపాటు ఉద్యాన పంటలు ఎక్కువగా సాగులో ఉన్నాయి.ఈవర్షంతో పంటలకు మేలు అని రైతులు తెలిపారు.

అనువంశీకానికి అందుబాటులో ధరఖాస్తులు

కడప కల్చరల్: ప్రభుత్వ సూచనల ప్రకారం వంశపారంపర్యహక్కు గల దేవాలయాల అర్చకులు తమ హక్కుల గురించి ప్రభుత్వానికి ప్రత్యేక దరఖాస్తు ద్వారా తెలుపాల్సి ఉంటుందని అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయభట్టర్ తెలిపారు. జిల్లాలోని పలు దేవాలయాల్లో వంశపారపర్య హక్కుగల అర్చకులు తమ హక్కు గురించి ప్రభుత్వానికి తెలిపేందుకు ప్రభుత్వం సూచించిన దరఖాస్తును మాత్రమే వాడాల్సి ఉందన్నారు.ఇవి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.కడప నగరంలోని దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులను పొందొచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు రూ. 5 లక్షల లోపు ఆదాయాల నిర్వహణ, ఆయా ఆలయాల అర్చకులకే ప్రభుత్వం అప్పగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ దరఖాస్తు ఫారం నమూనాను ఆన్‌లైన్‌లో పొందుపర్చారన్నారు. జీవో నంబర్ 298 ద్వారా వంశపారపర్య హక్కు గురించి ప్రభుత్వం స్పష్టత ఇచ్చిందని తెలిపారు.

సాగు సంబరం

- నదీ పరీవాహక, బోర్ల కింద జోరుగా నారుమడుల సాగు
- త్వరలో కేసీ కెనాల్‌కు నీరు విడుదల
- నారుమడుల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు



నారుమడి సాగుకు దమ్ము చేస్తున్న రైతన్న

కడప అగ్రికల్చర్: ఎగువప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు ఉండగా శనివారం నాటికి 860 అడుగులకు పైగా చేరింది. దీంతో కేసీ రైతుల్లో వరిసాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ నెల 20వ తేదీన కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిసింది. ఈ నెల 8వ తేదీన నంద్యాలలో జగరనున్న అగ్రికల్చర్ అడ్వయిజరీ మీటింగ్‌లో కేసీ కెనాల్‌కు నీటి విడుదల తేదీని కూడా ఖరారు చేయనన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వ్యవసాయ పనుల సందడి మెదలైంది.

పుష్కలంగా ఎరువులు

కేసీ కెనాల్ నీటి విడుదలపై ఆశలు పెరుగుతుండంతో రైతులు నారుమడుల సాగులో బిజీ అయ్యారు.ఇందులో భాగంగా మండల కేంద్రాలకు వెళ్లి విత్తనవడ్లు తెచ్చుకోవడం, వాటిని నానబెట్టి మండెకట్టి నారుమడులు సాగుచేసే పనిలో ఉన్నారు. ఇందుకోసం చిన్నిచిన్న కయ్యలను ఏర్పాటు చేసుకుని అందులో దమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే నీటి ఆధారం ఉన్న చాలా మంది రైతులు బోర్ల కింద, నదీ పరీవాహక ప్రాంతాల్లో నారుమడులను సాగు చేశారు. నీటి ఆధారం లేని వారు కేసీ కాలువ రకు నీరు విడుదల కాగానే నారుమడులు సిద్ధ చేసుకుంటారు. నీటి ఆధారం ఉండి ముందుగా నారుమడులను సాగు చేసుకున్న వారు కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు కూడా వేస్తున్నారు.రైతులకు కావాల్సిన ఎరువులను వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉంచారు.

- జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 83037.5 ఎకరాల్లో సాధారణ వరిసాగు లక్ష్యంగా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 9355 ఎకరాల్లో వరి సాగు చేశారు. కేసీ కెనాల్‌కు నీరు విడుదలైంతే సాగు మరింత ముమ్మరం కానుంది. జిల్లాలో గతేడాది సాధారణ సాగు లక్ష్యం 81852 ఎకరాలు కాగా ఈ ఏడాది 83037.5 ఎకరాలకు పెరిగింది. అంటే గతేడాది కంటే 1185.5 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది.
- రైతులు వరిపంట సాగుకు ముందుగా భూమిలో సత్తువ కోసం జీలుగలు, జనుములను చల్లుకుని దమ్ముకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 5613 టన్నుల పచ్చిరొట్ట విత్తనాలను కూడా ప్రభుత్వం సబ్సిడీ కింద రైతులకు పంపిణీ చేసింది. నీటి ఆధారం లేని వారు కేసీ కాలువకు నీరు రాగానే జీలుగలు, జనుములను సాగు చేసుకుంటారు. వరినాటు వేసేందుకు నెలరోజులకుపైగా గడువు ఉండటంతో ఈలోగా జీలుగలు, జనుము పొలంలో బాగా పెరిగి సత్తువగా పనికొస్తుంది.



విత్తనాలు చల్లుతున్న రైతు.

జిల్లాలో ప్యాడీ నర్సరీల లక్ష్యం: 1797
ఇప్పటి వరకు సాగైనవి : 1344
ఈ ఏడాది వరి సాధారణ సాగు లక్ష్యం: 83037.5 ఎకరాలు
ఇప్పటి వరకు సాగైంది: 9355 ఎకరాలు

సాగులో జాగ్రత్తలు

నారుమడిని సాగుచేయాలనుకునే రైతులు 10-12 రోజుల వ్యవధిలో 3 దఫాలు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి

- శిలీంధ్ర నాశినితో శుద్ధి చేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి
- 5 సెంట్ల నారు మడికి 2 కిలోల నత్రజని, 1 కిలో భాస్వరం, 1 కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి.(నత్రజనిని నారుమడి సాగుసమయం ముందు 1 కిలో, మరో కిలో సాగు చేసిన 12-14 రోజులకు)
- నారు ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరుతడిగా నీరు ఇవ్వాలి.
- జింక్ లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి
- నారుమడి సాగు చేసిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదంటే మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీలీటర్లు లేక క్లోరిపైరిపాస్ 2.0 మిల్లీలీటర్లను లీటర్ నీటికి కలిపి సాగు చేసిన 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలి.

సూచనలు పాటించాలి



నారుమడులు సాగు చేసుకునే రైతులు అధికారు సూచనలు తప్పని సరిగా పాటించాలి. ఇందులో నిర్లక్ష్యం చేస్తే సాగు తరువాత వరిపంటలకు చీడపీడలు ఆశించి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుంది. జాగ్రత్తలు పాటిస్తే తరువాత సాగులో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
– డాక్టర్ వీరయ్య, కేవీకే, కో ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త, వైఎస్సార్‌జిల్లా

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కలెక్టర్ విజయ్ రామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులతో వివిధ అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ క్లీనిక్‌ల భవన నిర్మాణాలపై దృష్టి సారించాలని కలెక్టర్ పంచాయితీరాజ్ అధికారులను ఆదేశించారు. నాడు-నేడు పనులు నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ అధికారులు, అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ గణేష్ కుమార్, డీఆర్ఓ గంగాధర్ గౌడ్, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, సీపీఓ వెంకట్రావ్ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో సుండుపల్లె తహసీల్దారు



ఏసీబీకి చిక్కిన తహసీల్దారు రవి, ఆర్ఐ కిరణ్

సుండుపల్లె(రాజంపేట): అన్నమయ్య జిల్లా సుండుపల్లె తహసీల్దారు గడపాల రవి శనివారం ఏసీబీవలలో చిక్కారు. 14400 కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఏసీబీ అధికారులు వలవేసి పట్టుకున్నారు. వివరాలు.. సుండుపల్లె మండల ఎర్రమనేనిపాలెం గ్రామానికి చెందిన రైతు జీ.ప్రభంజనరెడ్డి తన పొలానికి మ్యుటేషన్ చేయడానికి తహసీల్దారు, ఆర్ఐలను కలిశారు. రూ.80వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కడప అవినీతి నిరోధక శాఖ అధికారులు కాపుకాసి తహసీల్దారు రవి ఆదేశాల మేరకు ఆర్ఐ కిరణ్ బాధితరైతు నుంచి రూ.40 వేలు లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వచ్చి పట్టుకున్నారు. మ్యుటేషన్‌కు రూ.లక్ష డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు చట్టపరంగా తీసుకొవాల్సిన నిబంధనలను పూర్తి చేశారు. ఇరువురిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అంతకముందుగా తహసీల్దారు కార్యాలయంలో రికార్డులను ఏసీబీ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేశారు.

ఏపీ బేస్‌బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా లక్కిరెడ్డి



ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన లక్కిరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మల్లికార్జునరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. న్యాయవాదిగా, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్న తనను గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు కమిటీ సభ్యులకు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి పవన్ కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి తొలి అడుగు

- 2200 కోట్ల వ్యయంతో నిర్మాణం
- రాజంపేటమండలంలో ప్రారంభమైన పనులు



గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ప్రారంభమైన పనులు

రాజంపేట టౌన్: కడప-రేణిగుంట మధ్య నిర్మించనున్న నాలుగులేన్ల గ్రీన్‌ఫీల్డ్ (ఎన్‌హెచ్-716) హైవే నిర్మాణ పనులకు తొలి అడుగు పడింది. రాజంపేట మండలం కూచివారిపల్లె సమీపంలో శనివారం గ్రీన్‌ఫీల్డ్ హైవే లైజనింగ్ ఆఫీసర్ హర్షాభిరామ్ ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 122.9 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ హైవే రోడ్డుకు కూచివారిపల్లె రెవెన్యూవిలేజ్ సెంటర్ పాయింట్ అయినందున తొలిసారిగా క్లీనింగ్ అండ్ గ్రబ్బింగ్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. రెండు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయన్నారు. రెండు ప్యాకేజీలుగా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందన్నారు. కడప నుంచి చిన్నఓరంపాడు వరకు 64 కిలోమీటర్లు ఒక ప్యాకేజీ కింద, చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 59 కిలోమీటర్లు రెండోప్యాకేజీ కింద నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. అయితే రెండు ప్యాకేజీల కింద జరిగే పనులు సమాంతరంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కడప నుంచి రేణిగుంట వరకు నిర్మించే ఈమార్గంలో 52 లైట్ వెహికల్ అండర్ పాస్ (ఎల్‌వీయూ) బ్రిడ్జిలు, 8 వెహికల్ అండర్ పాస్ (వీయూపీ) బ్రిడ్జిలు, 72 మైనర్, మేజర్ బ్రిడ్జిలు, 240 కల్వర్టులు, మూడు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జీ (ఆర్‌ఓబీ)లను నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. హైవే నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణకుగాను దాదాపు 80 శాతం మందికి డబ్బులు చెల్లించే ప్రక్రియ కూడా పూర్తయినట్లు వివరించారు. కాగా హైవే నిర్మాణ పనులను శరవేగంగా చేపట్టేందుకు భారీ యంత్రాలను సిద్ధం చేశారు. ఈకార్యక్రమంలో వీఆర్ఓ జగదీష్, విలేజ్ సర్వేయర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

- ఈ హైవే నిర్మాణం పూర్తయితే తక్కువ సమయంలో కడప-తిరుపతి మధ్య రాకపోకలను సాగించవచ్చు. కడప-తిరుపతి మార్గంలో తరచూ అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ హైవే నిర్మాణ పూర్తయితే రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గుముఖం పడతాయి.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

కడప అర్బన్: ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా శాశ్వత లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని కడపలోని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ తెలిపారు. శనివారం కడపలోని బసిరెడ్డి లా కళాశాలలో 'ప్రజా ప్రాయోజిత, న్యాయసేవల అవగాహన సదస్సు' నిర్వహించారు. విద్యార్థులకు లోక్ అదాలత్ ద్వారా జరిగే న్యాయాలకు సంబంధించిన అంశాలను గురించి వివరించారు.

నిరంతర సాధనే విజయానికి మార్గం





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏపీ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి అంకమ్మచౌదరి, తలపడుతున్న క్రీడాకారులు

- ఏపీ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి అంకమ్మ చౌదరి
- ఉత్సాహంగా సాగుతున్న బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

కడప స్పోర్ట్స్: క్రీడాకారులు ప్రణాళికబద్ధంగా నిరంతర సాధన చేయడం ద్వారా విజయాలు సొంతం చేసుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి అంకమ్మ చౌదరి పేర్కొన్నారు. కడపలోని పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహిస్తున్న ఏపీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-23లో నిర్వహిస్తున్న పోటీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా క్రీడాకారులు సాధన చేయాలన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్. జిలానీబాషా మాట్లాడుతూ టోర్నమెంట్‌లో భాగంగా విచ్చేసిన క్రీడాకారులకు అత్యుత్తమ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం అతిథులు క్రీడాకారును పరిచయం చేసుకుని పోటీలను నిర్వహించారు.

నేడు ఫైనల్ మ్యాచ్‌లు..

మెయిన్ డ్రాలో భాగంగా క్రీడాకారులు మధ్య నిర్వహించిన మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. శనివారం నిర్వహించిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కడప క్రీడాకారులు ఎం.విజయ్‌రాజ్(కడప)-డి.షబ్నం బేగం (కర్నూలు) జోడి ఎస్. దత్తాత్రేయ రెడ్డి-వెన్నెల (కడప) జోడీపై 23-21, 23-21 వరుస సెట్లతో విజయం సాధించారు. అబ్దుల్ రెహమాన్ (కడప)-మమైక్య (కర్నూలు) జోడి కిరణ్‌కుమార్-హేమద్యుతి (విశాఖ)పై 21-13, 11-21, 21-18 పాయింట్లతో విజయం సాధించారు. కాగా ఆదివారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక వన్‌టౌన్ బైపాస్‌రోడ్డులో మట్కా నిర్వహిస్తున్న ఐదుగురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బైపాస్ రోడ్డులోని గుడి వెనుక భాగంలో మట్కా నిర్వహించడంతోపాటు తెలంగాణా రాష్ట్రానికి చెందిన మద్యం కలిగియున్నారని సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మట్కా స్లిప్పులు, రూ.17,980 నగదు, 10 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించనున్నట్లు సీఐ తెలిపారు.

చంద్రబాబు మాటలను నమ్మొద్దు

- వైఎస్ షర్మిల, సునీతపై కపట ప్రేమ
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : టీడీపీ అధినేత చంద్రబాబు మాటలను నమ్మొద్దని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానికంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా పర్యటనలో చంద్రబాబు రాజకీయ అవసరాల కోసం కపట ప్రేమను ప్రదర్శించారన్నారు. కడప జిల్లా వాసుల గురించి బాబు గతంలో రాక్షసులని, కడప గుండాలని, రౌడీలని హీనంగా మాట్లాడారన్నారు. అలాంటిది ఇప్పుడు ఎన్నికల అవసరాల కోసం కడపలోనే ఉండిపోవాలని అనడాన్ని బట్టి, కపట ప్రేమ అర్థమవుతోందన్నారు. జిల్లా ప్రజలపై ప్రేమలేని చంద్రబాబుకు వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబ సభ్యులపై ప్రేమను కనబరచడం ఆశ్చర్యంగా ఉందని, ఇదే క్షుద్ర రాజకీయమని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంలో చిచ్చు పెట్టేందుకు వారి కుటుంబ సభ్యులపై విపరీతమైన ప్రేమాభిమానాలను చూపుతున్నారన్నారు. వైఎస్ షర్మిలమ్మ, వైఎస్ సునీతారెడ్డిల గురించి చంద్రబాబు వగలమారి ఏడ్పులు ఏడ్చారని అన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి ఓటమికి కారణమైన చంద్రబాబు ఇప్పుడు ఆమె కుమార్తె వైఎస్ సునీతారెడ్డిని ట్రాప్‌లోకి తీసుకుని రాజకీయంగా వాడుకునేందుకు ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారన్నారు. రక్త సంబంధాల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. తన మామ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి తెలుగుదేశం పార్టీని హస్తగతం చేసుకున్న చంద్రబాబు మాటలను ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ మరణానికి కారణం ఎవరనేది రాష్ట్ర ప్రజలంతా చెబుతారన్నారు. రాజకీయంగా ఎదగకూడదనే ఉద్దేశంతోనే హరికృష్ణ కుమారుడైన జూనియర్ ఎన్టీఆర్‌ను తొక్కిపడేశారని, దగ్గుపాటి వెంకటేశ్వరరావును అణచివేశారన్నారు. వాడుకుని వదిలేసే అలవాటు ఉన్న చంద్రబాబు సొంత తమ్ముడైన రామ్మూర్తి నాయుడును ఉనికి లేకుండా చేశారని విమర్శించారు. సొంత రక్తసంబంధీకులపై ప్రేమను చూపించలేకపోయిన చంద్రబాబు వైఎస్ కుటుంబ సభ్యులపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. పులివెందులకు వచ్చి వైఎస్ వివేకానందరెడ్డి హత్య గురించి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని విమర్శించారన్నారు. అవినాష్‌రెడ్డి నేరస్తుడని కోర్టు నిర్ధారిస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తప్ప కడప జిల్లాలోని ఎమ్మెల్యేలమంతా రాజీనామా చేస్తాం అన్న దానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఉత్తముడైన అవినాష్‌రెడ్డిపై విమర్శలు చేసి టీడీపీ ఆయనను మానసిక క్షోభకు గురిచేస్తోందన్నారు. చంద్రబాబుపై ఆరోపించిన ప్రతి కేసుకు స్టేలు తెచ్చుకుని విచారణకు పోలేని పిరికివాడివని విమర్శించారు.

ఏమి అభివృద్ధి చేశావు

2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కడప జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. పరిశ్రమలను ఏర్పాటు చేశారా, ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేశారా, యూనివర్సిటీలు మంజూరు చేశారా, ఏదైనా ఒక్క పథకం పూర్తి చేసివుంటే చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధిపై టీడీపీ నేతలు ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు ముందుకు రావాలని సవాల్ విసిరారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి ఏపీఎన్ఆర్‌టీఎస్ సాయం

– కువైట్ నుంచి స్వదేశానికి తీసుకొచ్చిన వైనం


కువైట్ ఆసుపత్రిలో యానాదిరెడ్డిని పరామర్శిస్తున్న ఎం.బాలిరెడ్డి

కడప కార్పొరేషన్ : మతిస్థిమితం లేని వ్యక్తిని భారత దేశానికి తీసుకురావడానికి ఏపీఎన్ఆర్‌టీఎస్ సాయపడింది. వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం అనంతసముద్రానికి చెందిన ఆకేపాటి యానాదిరెడ్డి 20 ఏళ్లక్రితం జీవనోపాధి కోసం కువైట్ వెళ్లాడు. ఎయిర్ కండీషన్(ఏసీ) కంపెనీలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ ఏడాది మార్చి 26న పని చేస్తూ పెద్ద నిచ్చెనపై నుంచి కిందపడి తలకు గాయమవడమేగాక, వెన్నుపూస దెబ్బతినింది. తలకు దెబ్బ తగలడం వల్ల మతి స్థిమితం కోల్పోయాడు. తన వాళ్లను కూడా గుర్తించని స్థితిలోకి వెళ్లిపోయాడు. నాలుగు మాసాలైనా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ఆయన తమ్ముడు నరసారెడ్డి స్వదేశానికి తీసుకురావాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆసుపత్రిలో చికిత్సకు అయిన డబ్బు కట్టి డిశార్చి చేసుకొని పోవాలని యాజమాన్యం చెప్పడంతో ఏం చేయాలో అర్థం కాక వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. ఆయన భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి పేదవారు అయినందున ఆసుపత్రి ఫీజు మాఫీ చేయించారు. ఈ సందర్భంగా యానాదిరెడ్డి తమ్ముడు నరసారెడ్డి మాట్లాడుతూ ఏపీఎన్ఆర్‌టీఎస్ ద్వారా ప్రవాసాంధ్రుల సమస్యలు పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, భారత రాయబార అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. చెన్నై నుంచి వేలూరు వరకూ ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేసిన ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్, భారత ఎంబసీలో పేపర్ వర్క్ పూర్తి చేసిన సామాజిక కార్యకర్త రెడ్డెయ్యరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

'నారా' కనుసన్నల్లోనే దాడులు

– వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్

పులివెందుల రూరల్ : మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు కనుసన్నల్లోనే అన్నమయ్య జిల్లా అంగళ్లు, పుంగనూరు ప్రాంతాలలో దాడులు జరిగాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ విమర్శించారు. శనివారం స్థానిక దూదేకుల సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో గెలవలేమనే విషయం చంద్రబాబుకు అర్థమైందని.. అందువల్లే దాడులకు తెగబడుతున్నారన్నారు. రాయలసీమ ప్రాంతంలో ప్రాజెక్టుల గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నానని చెప్పి, అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. ముందస్తు ప్రకారమే పుంగనూరు, అంగళ్లు ప్రాంతాలలో దాడులు చేయించారన్నారు. ఒకవైపు తనకు రక్షణ లేదంటూనే పోలీసులపై దాడులు చేయించడం ఎంత వరకు సమంజసమన్నారు. చంద్రబాబు ఎన్ని విధ్వంసాలు సృష్టించినా సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు నేర్పిన విద్య వల్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, బలపనూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత లేదు'


మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

జమ్మలమడుగు : రాయలసీమకు కృష్ణా జలాలు తీసుకుని రావడం అసాధ్యమని కృష్ణస్వామి కమిటీ ద్వారా చెప్పించిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హతే లేదని రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో మండల వ్యవసాయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు మాజీ ముఖ్యమంత్రి టీడీపీ వ్యవస్థాపకుడైన ఎన్టీ రామారావు గాలేరు-నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ ప్రాజెక్టుల రూపకల్పన చేశారని పేర్కొన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన నారా చంద్రబాబు నాయుడు 14 ఏళ్ల పాలనలో ఆ ప్రాజెక్టులపై దృష్టి సారించలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తిరిగి కమిటీ వేసి 20 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించే విధంగా కాలువలు తవ్వి గండికోట ప్రాజెక్టుకు అందించడం జరిగిందన్నారు. తక్కువ కాలంలో 90 శాతంపైగా ప్రాజెక్టు పనులు చేసిన ఘనత వైఎస్ కుటుంబానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ రమణారెడ్డి, కమిటీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు వెళ్లి పింఛన్ అందజేత



పెద్దముడియం : మండలంలోని గుండ్లకుంట సచివాలయంలో పని చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ యోహాన్, వలంటీర్ సుధాకర్ విజయవాడకు వెళ్లి పింఛన్ అందజేశారు. గుండ్లకుంట గ్రామానికి చెందిన చిన్నర్రిగాళ్ల రాముడు మూడు నెలల క్రితం విజయవాడలోని హాస్పిటల్‌లో కాలికి ఆపరేషన్ చేయించుకొన్నాడు. డాక్టర్ సూచన మేరకు 5 నెలలు ప్రయాణాలు చేయవద్దని చెప్పటంతో.. అక్కడే ఉన్న తన చిన్న కుమారుని వద్ద ఉన్నాడు. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్ విజయవాడకు వెళ్లి చిన్నర్రిగాళ్ల రాముడికి వృద్ధాప్య పింఛన్ మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా వారికి పింఛన్‌దారుడు కృతజ్ఞతలు తెలిపారు.

చైన్ స్నాచింగ్

కడప అర్బన్ : కడపలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో కిరాణా షాపు నడుపుతున్న రమాదేవి చైన్ శనివారం స్నాచింగ్‌కు గురైందని రిమ్స్ పీఎస్ సీఐ రామచంద్ర తెలిపారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు వాటర్ ప్యాకెట్లు కావాలని ఆమెను అడిగారు. వాటిని ఇచ్చేందుకు ఆమె రాగానే.. మెడలోని నాలుగు తులాల బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయారు.

ఆధిక్యంలో సౌత్‌జోన్ జట్టు


మ్యాచ్ ఆడుతున్న సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్లు


సాయిసూర్యతేజారెడ్డి, (132 పరుగులు)


ప్రణవ్‌రెడ్డి, (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 మల్టీడేస్ జోనల్ మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోటీల్లో భాగంగా రెండో రోజు శనివారం 206 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 311 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని గీత్ 74 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్ ప్రణవ్‌రెడ్డి 5 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్‌జోన్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 61 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 78 బంతుల్లో 10 ఫోర్లు, 10 సిక్సర్‌లతో 132 పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ బౌలర్లు ఆదిత్యారెడ్డి 2, హర్షవర్ధన్ 2, అభినవ్ 2 వికెట్లు తీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి సౌత్‌జోన్ జట్టు 167 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

యువకుడి ఆత్మహత్య


వీరవంశీ (ఫైల్)

చాపాడు : మండలంలోని కొత్తరాజువారిపేటకు చెందిన ఆవుల వీరవంశీ (24) శనివారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వరలక్ష్మికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు ఆవుల వీరవంశీ డిగ్రీ వరకు చదువుకుని ఇంటి వద్దనే ఉంటూ గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం కడపకు వెళ్లిన తల్లి వరలక్ష్మికి వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని, ఇందుకు ఎవరూ కారణం కాదని, తన వ్యక్తిగత సమస్యలేనని చెప్పాడు. తల్లి చెబుతున్నా వినకుండా ఫోన్ ఆఫ్ చేశాడు. దీంతో గ్రామంలోని తమ బంధువులు, స్థానికులకు ఆమె సమాచారం ఇచ్చింది. స్థానికులు ఇంటి తలుపు పగులగొట్టి వెళ్లి చూడగా.. చీరెతో కొండికి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని 108 అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చాపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అపరిచితుల కాల్స్‌పై అప్రమత్తత అవసరం

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : ఇటీవల కాలంలో వాట్సాప్ కాల్స్ ద్వారా అధికంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడి అమాయకుల నుంచి రూ.లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్ కాల్స్ ద్వారా హనీ ట్రాప్ (న్యూడ్ వీడియో కాల్స్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి రూ.లక్షలు డిమాండ్ చేయడం), ఇతర సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఎస్పీ తెలిపారు. అపరితుల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్ స్వీకరించవద్దని పేర్కొన్నారు. నేషనల్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్.సి.ఆర్.పి)లో అత్యధికంగా వాట్సాప్ కాల్స్ ద్వారా పలువురు మోసపోయినట్లు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. అలాగే ఉద్యోగాల పేరిట, డబ్బులు రెట్టింపు చేస్తామంటూ వచ్చే మెసేజ్‌లు, లింక్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దన్నారు. డబ్బులు రెట్టింపు చేస్తామని చెబుతూ ముందుగా వెయ్యి రూపాయలకు మరుసటి రోజు రూ.500, 1000 అదనంగా కలిపి అకౌంట్‌లో వేసి ఎర వేస్తారని.. అనంతరం డబ్బులకు ఆశపడి రూ.లక్షల్లో పెట్టుబడిగా పెట్టే అమాయకులను మోసం చేస్తారని వివరించారు.

- బ్యాంక్ అకౌంట్ డీ- ఆక్టీవేట్ అయ్యిందని, ఈ కింద వుండే లింక్‌ను క్లిక్ చేయాలని మెసేజ్‌లు వస్తాయని, వాటిని క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలో వున్న నగదు సైబర్ నేరగాళ్లకు చేరుతుందన్నారు.
- మొబైల్ ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా వెంటనే బాధితులు సీ.ఈ.ఐ.ఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే సదరు ఫోన్ బ్లాక్ చేయబడుతుందని, ఫోన్ రికవరీ అయిన తరువాత సీ.ఈ.ఐ.ఆర్ వెబ్‌సైట్‌లో వెళ్లి అన్ బ్లాక్ చేసుకోవచ్చని తెలిపారు. సైబర్ క్రైమ్ ఇన్‌చార్జి డీఎస్పీ ఈ.బాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో సీ.ఈ.ఐ.ఆర్ ద్వారా 53 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందని వివరించారు.
- ప్రజలకు సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య వున్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ డాట్ సైబర్‌క్రైమ్ డాట్ జీఓవి డాట్ ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్.సి.ఆర్.పి)లో టోల్ ఫ్రీ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

భర్త, అత్త వేధింపులు తాళలేక..


మహాలక్ష్మి మృతదేహం

చెన్నూరు : భర్త, అత్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరు కొత్త గాంధీనగర్‌కు చెందిన సాల మహాలక్ష్మి(37), వెంకటయ్య బేల్దారి పనులకు వెళుతూ పరిచయడం ఏర్పడటంతో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరు చెన్నూరులోని లక్ష్మీనగర్‌లో ఇక ఇల్లు బాడుగకు తీసుకుని జీవిస్తున్నారు. ఆమెపై భర్త అనుమానం పెంచుకుని వేధించడం, కొట్టడం, తిట్టడంతో లక్ష్మీనగర్ నుంచి శుక్రవారం అత్తగారిల్లు అయిన కొత్త గాంధీ నగర్‌కు వచ్చింది. అత్త కూడా తిట్టడంతో శనివారం ఉదయం అత్తవారి ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మహాలక్ష్మి తల్లి ఎం.సీతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పార్నపల్లెలో వృద్ధుడి హత్య



ఈశ్వరయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న డాగ్ స్క్వాడ్

సహ కూలీ హత్య చేసినట్లు పోలీసుల అంచనా

లింగాల : మండల పరిధి పార్నపల్లె కోనమల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఓ వృద్ధుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు శనివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కడప నగరానికి చెందిన ఈశ్వరయ్య (70) కొంత కాలంగా ఆలయంలో వాచ్‌మ్యాన్‌గా పని చేస్తున్నాడు. ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం జరుగుతున్నందు వల్ల కొంత కాలంగా వంట మనిషి లేకపోవడంతో.. గార్లదిన్నె మండలం ఇటుకలపల్లెకు చెందిన వీరాంజనేయులు వంట మనిషిగా చేరాడు. ఈశ్వరయ్య ఇంటికి వెళ్లి రావడంతో అతని వద్ద డబ్బులు ఉంటాయని భావించి, వాటిని లాక్కునేందుకు వీరాంజనేయులు పథకం రచించారని సమాచారం. ఈశ్వరయ్యను వంట గదిలోకి పిలుచుకుని వెళ్లి అక్కడ కర్రతో బాది హతమార్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని రూరల్ సీఐ బాల మద్దిలేటి వెల్లడించారు. మృతదేహం అక్కడ ఉండగానే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుకున్నాయి. క్లూస్ టీం ఎస్ఐ వినీల అక్కడి వేలి ముద్రలను సేకరించింది. డాగ్ స్క్వాడ్ పరిసర ప్రాంతాలలో తిరిగింది. వీరాంజనేయులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని వారు తెలిపారు. మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆలయ కమిటీని కూడా విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ఎస్ఐ హృషికేశవరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రైలు కింద పడి..

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప- కనుమలోపల్లి రైల్వేస్టేషన్ల మధ్య దిగువ రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. 40 ఏళ్ల వయసు, 5.8 అడుగుల ఎత్తు కలిగి, తెల్లటి లోయర్, ఎర్రటి టీ షర్ట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.